అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 31 జనవరి 2023

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రజలకు కుష్టువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా సర్పంచ్ గుల్లే లావణ్య గంగాధర్,మెడికల్ ఆఫీసర్ ప్రసన్న ప్రియ,హెల్త్ అసిస్టెంట్ పండరీ, ఏఎన్ఎం కల్పన,వైద్యులు పాల్గొన్నారు.


గాంధీ చిత్రపటానికి నివాళి

అప్పులకు మిత్తీ కట్టలేకపోతున్నం

బిల్లులు రావడం లేదని సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అప్పులు తెచ్చి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టామని, వాటి బిల్లులు రాకపోవడంతో తీసుకొచ్చిన అప్పులకు మిత్తీలు కట్టలేకపోతున్నామని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట సోమవారం నందిపేట్ సర్పంచ్ సాంబారు వాణి ఆమె భర్తతో కలిసి పెట్రోల్‌పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది వెంటనే అప్రమత్తమై అడ్డుకొని వారిని అధికారుల వద్దకు తీసుకెళ్లారు.

వివరాలు మెయిన్‌లో..



సారోస్తున్నారు..

- ముందే సమాచారమిచ్చి బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారుల రైడ్
- అన్ని మూసివేసి ఉంచడంతో బెల్టేదందే లేదంటూ తిరిగి వెళ్లిపోయిన వైనం



తాళ్లరాంపూర్‌లో మొన్న మద్యం విక్రయాలు..



అధికారుల తనిఖీ నేపథ్యంలో నిన్న మూసివేత

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల మండలంలో వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగి బెల్టుషాపులు నిర్వహిస్తుండటంపై నవతెలంగాణ దినపత్రిలో 'పల్లెల్లో బెల్ట్ దందా' శీర్షికతో ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఎక్సైజ్ సీఐ గుండప్ప సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు చేపట్టి.. ఎక్కడా బెల్ట్‌షాపులు లేవని క్లీన్ చిట్ ఇవ్వడం గమనార్హం. కాగా సారు వస్తున్నారని దుకాణాలు మూసి ఉంచాలని బెల్ట్ షాపుల నిర్వహకులకు ఎక్సైజ్ అధికారులు ముందే సమాచారం ఇచ్చినట్టు భోగట్ట. కొసమెరుపు ఏమిటంటే అధికారులు దాడులు నిర్వహిస్తున్న సమయంలో తాళ్లరాంపూర్, గుమ్మిర్యాల్ గ్రామాల్లో బెల్ట్ షాపులు మూసి ఉన్నా.. షాపులు ఎప్పుడు తెరుస్తారో అని మందుబాబులు అక్కడే వేచి ఉండటం గమనార్హం. ఇదేమి పట్టనట్లు ఎక్సైజ్ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేపట్టి వెనుదిరిగారు. ఈ విషయమై జిల్లా ఎక్సైజ్ అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.





ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లో..


తాళ్లరాంపూర్‌లో బెల్ట్ షాప్ ఎదుట ఎదురుచూపులు

'పోడు' పట్టాలను సిద్ధం చేయండి

- కలెక్టర్లకు మంత్రులు, సీఎస్ దిశా నిర్దేశం
- కంటి వెలుగు, మన ఊరు-మన బడి, ఆయిల్‌పామ్ సాగుపై సమీక్ష
- పారదర్శకంగా టీచర్ల బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఆదేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

పోడు భూములకు సంబంధించిన తుది దశ ప్రక్రియలను తక్షణమే పూర్తి చేయాలని, ఫిబ్రవరి మొదటి వారం నాటికి ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలను సిద్ధం చేసుకుని అన్ని విధాలుగా సమాయత్తం అయి ఉండాలని రాష్ట్ర అటవీ శాఖా మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సత్యవతి రాథోడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. సోమవారం సాయంత్రం ఆయా జిల్లాల కలెక్టర్లతో పోడు భూములు, కంటి వెలుగు, మన ఊరు – మన బడి, ఆయిల్ పామ్ సాగు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు తదితర అంశాలపై సీ.ఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. పోడు భూములకు సంబంధించిన సమీక్షలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. అటవీ ప్రాంత పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పోడు భూముల సమస్య పరిష్కారానికి సాహసోపేత నిర్ణయం తీసుకుందని మంత్రులు గుర్తు చేశారు. ప్రభుత్వ అభిమతం మేరకు పోడు భూములపై ఆధారపడి జీవనాలు సాగిస్తున్న అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూడాలని, అదే సమయంలో ఇకపై అటవీ ప్రాంతాల ఆక్రమణ, చెట్ల నరికివేతకు ఏమాత్రం ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ, ఇప్పటికే పోడు భూములకు సంబంధించిన కసరత్తు దాదాపుగా తుదిదశకు చేరినందున, ప్రస్తుత ఫిబ్రవరి మాసంలోనే అర్హులైన వారికి ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి క్లెయిమ్ ను క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, ప్రభుత్వం నిర్దేశించిన నియమ, నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. గ్రామ సభల తీర్మానాలు, సబ్ డివిజన్ స్థాయి కమిటీ సిఫార్సులను పరిగణలోకి తీసుకుంటూ, స్పష్టమైన ఆధారాలను పొందుపరుస్తూ క్లెయిమ్ లను ఆమోదించాలని, నిబంధనలకు అనుగుణంగా లేని వాటిని తిరస్కరించాలని తెలిపారు. పోడు పట్టాల ముద్రణలో అక్షర దోషాలు, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని నిశితంగా పర్యవేక్షణ చేయాలని, ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో తప్పులు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ప్రతి శనివారం డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇతర సిబ్బందికి శిక్షణ అందించాలని సీ.ఎస్ సూచించారు. కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్న వైద్య బృందాలకు మెరుగైన వసతులతో కూడిన సదుపాయాలూ అందుబాటులో ఉండేలా చొరవ చూపాలన్నారు. కాగా, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఎలాంటి అపోహలు, అనుమానాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీలు, సీనియారిటీ జాబితాకు సంబంధించి వచ్చే అభ్యంతరాలను వెంటదివెంట పరిష్కరించాలని సూచించారు. ఉపాధ్యాయుల సౌకర్యార్థం అవసరమైతే ప్రత్యేకంగా సదరం క్యాంప్‌లను ఏర్పాటు చేయించాలని అన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేసిన మీదట, విద్యా సంవత్సరం ముగిసిన తరువాతనే వాటికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం చివరి దశకు చేరి, వార్షిక పరీక్షలు సమీపించినందున ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. కాగా, మన ఊరు – మన బడి కార్యక్రమం కింద పనులన్నీ పూర్తయిన పాఠశాలలను ఫిబ్రవరి 01 తేదీన మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు జరిపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రారంభోత్సవాలకు ఎంపిక చేసిన బడులలో ఏ చిన్న పని కూడా అసంపూర్తిగా ఉండకుండా చూసుకోవాలని, పండగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు జరగాలన్నారు. ఆయిల్‌ఫామ్ సాగుపై సమీక్ష జరుపుతూ, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పంట సాగయ్యేలా చొరవ చూపాలని సీ.ఎస్ సూచించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడుతున్న కలెక్టర్

ఈ విషయమై కలెక్టర్ సి.నారాయణరెడ్డి స్పందిస్తూ, జిల్లాలో మొత్తం ఆరు వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని లక్ష్యం కాగా, ఇప్పటికే 2316 ఎకరాల్లో పంట సాగు ప్రారంభం అయ్యిందని, మరో 1460 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి రైతులు ముందుకు వచ్చి డీడీలు చెల్లించారని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఎర్రజొన్న, మొక్కజొన్న తదితర పంటలు తుది దశలో ఉన్నాయని, కోతలు పూర్తి కాగానే ఆయిల్‌పామ్ పంట సాగు విస్తీర్ణం పెద్ద ఎత్తున జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎం.పీ.పీలు, జెడ్పిటీసీలు, ఇతర స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను సైతం భాగస్వాములను చేస్తూ, ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగానే కల్పిస్తున్నామన్నారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి జిల్లాలో పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా ఆయిల్‌పామ్ పంట సాగయ్యేలా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకుని తదనుగుణంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, డీఎఫ్ఓ వికాస్ మీనా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగూరావు, డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శన్, డీ ఈ ఓ దుర్గాప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సింగ్ దాస్, డీ.ఏ.ఓ తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌పోసుకొని ఆత్మహత్యాయత్నం

- స్వరాజ్ షోరూం మేనేజర్ ట్రాక్టర్ డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్తాపం




చికిత్స పొందుతున్న బాధితుడు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ట్రాక్టర్ కొనుగోలు చేసిన డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఓ వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్వరాజ్ షోరూంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడు, బాధితుడి కుటుంబీకులు వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం క్యాసంపల్లి తండాకు చెందిన అంగోత్ ప్రకాష్ ఏడాది క్రితం జిల్లా కేంద్రంలోని స్వరాజ్ షోరూంలో ట్రాక్టర్‌ను విక్రయించాడు. షోరూం మేనేజర్ ట్రాక్టర్ కు 3.50 లక్షలకు ధర చేసుకుని అడ్వాన్సుగా 50 వేలు ఇచ్చారు. మిగతా డబ్బుల కోసం ఏడాది నుంచి రేపుమాపు అంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అయితే సోమవారం షోరూంకు వెళ్లిన ప్రకాష్ మేనేజర్‌తో మాట్లాడినా డబ్బులు ఇవ్వకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. దాంతో భయాందోళనకు గురైన షోరూం సిబ్బంది పోలీసులకు సమాచమివ్వగా జిల్లా ఆస్పత్రికి తరలించారు. జిల్లా అదనపు సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆస్పత్రికి వచ్చి బాధితుని స్టేట్మెంట్ తీసుకున్నారు. బాధితుడు ప్రకాష్‌కు 40 శాతం కాలిన గాయాలు అయ్యాయి. మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించాలని వైద్యులు సూచించారు. తమకు న్యాయం చేయాలని బాధితుని కుటుంబ సభ్యులు వేడుకున్నారు. ఫిర్యాదు మేరకు యాజమాన్యంపై కేసు నమోదు చేశామని సిఐ నరేష్ తెలిపారు.

కుక్కల సంతతి తగ్గించాలి

- జంతు సంరక్షణ అధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించి వాటి సంఖ్యను తగ్గించే విధంగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లా జంతు సంరక్షణ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. మున్సిపల్ అధికారులు పట్టుకున్న పశువులు ఉంచేందుకు ప్రత్యేక స్థలం కేటాయించాలని తెలిపారు. గోశాలల్లోని పేడను ఉపయోగించి గోబర్ గ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గోశాలకు కావలసిన వసతులు, మందులను పశు వైద్యాధికారులు ఇవ్వాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీవో వాణి, జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ భరత్, జిల్లా మార్కెటింగ్ అధికారిని రమ్యపశు వైద్యాధికారులు సంజయ్, భాస్కర్, దేవేందర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

బాల్యవివాహాలతో ధీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు



కార్యక్రమలో మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

బాల్య వివాహాలు చేస్తే బాలికల్లో అనారోగ్య పరిస్థితులు తలెత్తుతాయని, దీర్ఘకాలిక మానసిక, శారీరక సమస్య లకు కారణమవుతున్నాయని పరిశోధనలు చెబుతున్నాయని సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 18 ఏళ్ళు నిండని ఆడ పిల్లలకు పెళ్లిళ్ల చేయకూడదని, అలా చేస్తే జైలు శిక్షలు, జరిమానాలు ఉంటాయని వివరించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూళనపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహ వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని అన్ని వ్యవస్థలు, వర్గాలు సంపూర్ణ మద్దతును అందించేలా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారందరితో బాల్య వివాహాలు నిర్మూలనకు తామంతా కలసి కట్టుగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు బాల్య వివాహాలు నిర్మలన కోసం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానొపాధ్యాయుడు ప్రేమ్ దాస్, ఎంపీటీసీ బీరయ్య, ఉప సర్పంచ్ రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేందర్, అంగన్వాడీ సూపర్ వైజర్ పద్మ విడిసి అధ్యక్షుడు రాజు అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకై..
9న చలో హైదరాబాద్

- పేదలందరూ హాజరై జయప్రదం చేయండి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేదలందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాల సాధనకు ఫిబ్రవరి 9న చలో హైదరాబాద్ జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ప్రజా సంఘాల పోరాట ఐక్యవేదిక సమావేశం నిర్వహించి ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదలందరికీ, అర్హులైన వారందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని టీఆర్ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని నేటికీ లక్షల సంఖ్యలో పేదలకు ఇల్లు లేక పూరిగుడిసెలో నివాసం ఉంటున్నారని చెప్పారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులందరికీ అందే విధంగా ప్రభుత్వం కసరత్తు చేయాలని, అందుకు అనుగుణంగా ఈ బడ్జెట్ సమావేశంలో అత్యధిక నిధులు కేటాయించి ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చాలని ప్రభుత్వానికి సూచించారు. వెంటనే పేదలకు అందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 9న చలో హైదరాబాద్ కార్యక్రమానికి పేదలందరూ పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల పోరాట ఐక్యవేదిక జిల్లా నాయకులు పెద్దివెంకట్‌రావు, నూర్జహాన్, శంకర్‌గౌడ్, వెంకటేష్, సబ్బని లత , అనిల్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకోసం పాలకులు చేసిందేమీ లేదు


మాట్లాడుతున్న వడ్డెపల్లి సుభాశ్‌రెడ్డి

నవతెలంగాణ-సదాశివనగర్

ప్రజల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి సుభాశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సోమవారం సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. అనంతరం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యాత్ర కుప్రియల్, మల్లుపెట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. కార్యక్రమంలో రామరెడ్డి జడ్పీటీసీ మోహన్ రెడ్డి, సదాశివనగర్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు సంతోష్ పాటిల్, యూత్ అధ్యక్షుడు లింగారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు గౌస్, నాయకులు అమర్సింగ్ నాయక్, అజీమ్, తిరుపతి, రాజయ్య, భాస్కర్, రవి, నరేందర్, రాములు తదితరులు ఉన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను
సత్వరమే పరిష్కరించాలి


ప్రజవాణీలో వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 85 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి.

వరికి కాండం తొలుచు పురుగు

- నివారణ చర్యలు సూచించిన వ్యవసాయాధికారులు


పంటను పరిశీలించి సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండల కేంద్రంలోని వరి పంట పొలాలను మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ప్రస్తుతం కాండం తొలుచు పురుగు, మొవ్వు రోగం ప్రధానంగా ఆశిస్తున్నట్టు తెలిపారు. దీంతో పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వెల్లడించారు. దీని నివారణకు కార్టస్ హైడ్రోక్లోరైడ్ 2 మిల్లీ లీటర్ చొప్పున వాడి నివారించుకోవచ్చని తెలిపారు. వరిలో వచ్చే అగ్గితెగులు, జింక్ లోపాన్ని రైతులు నివారించుకోవచ్చని అన్నారు. చీడపీడల నివారణపై వ్యవసాయాధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రైతు బంధు అధ్యక్షులు సున్నపు అంజయ్య, గ్రామ రైతు బంధు అధ్యక్షులు బద్దం ప్రభాకర్,ఏఈఓ లు స్నేహ,సచిన్,రైతులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

అనుదినం.. జనస్వరం నవతెలంగాణ

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం.. అవినీతి, అక్రమాలను వెలికితీసే ధైర్యం, ప్రశ్నించేతత్వం, ప్రజాసమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా..? ఆ అవకాశాన్ని 'నవతెలంగాణ' కల్పిస్తోంది. ఖాళీ మండలాల్లో భర్తీకి ఆహ్వానిస్తోంది

ఖాళీ మండలాలు

నిజామాబాద్ జిల్లా	కామారెడ్డి జిల్లా
1. బోధన్‌టౌన్	1. కామారెడ్డి రూరల్
2. వేల్పూర్	2. బాన్సువాడ రూరల్
3. బాల్కొండ	3. మాచారెడ్డి
4. రుద్రూర్	4. బీర్కూర్
	5. బీబీపేట్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పనిచేసేందుకు డిజైనర్, కామారెడ్డి, బాన్సువాడ కేంద్రాలుగా పనిచేసేందుకు మార్కెటింగ్ సిబ్బంది కావలెను.

ఇంటర్వ్యూ తేదీ : 12.02.2023
సమయం : ఉదయం 11 గంటలకు
అడ్రస్ : నవతెలంగాణ దినపత్రిక కార్యాలయం సుభాష్‌నగర్. ఎస్‌బిఐ పక్కన, నిజామాబాద్.

సంప్రదించాల్సిన నెంబర్లు :
9494573764, 9494617640

జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ విజేతల ప్రకటన

నవతెలంగాణ-కంఠేశ్వర్

యువ కేంద్ర నిజామాబాద్ ఆధ్వర్యంలో ఆన్ లైన్ ద్వారా నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీల విజేతలను సోమవారం ప్రకటించారు. నిజామాబాద్ జిల్లాకు మొదటి స్థానంలో అక్షిత, రెండవ స్థానంలో శ్రీజ జాదవ్ కామారెడ్డి జిల్లాలో మొదటి స్థానం మౌనిక, రెండవ స్థానంలో రాగవర్శిని నిలిచారు.వీరు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అక్కడ గెలుపొందితే జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధిస్తారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగాలుగా కేశవ్ కుమార్, వినయ కుమార్, మోహన్ దాస్, హర్ష రాథోడ్, రవీందర్ రెడ్డి వ్యవహరించారు. విజేతలను నెహ్రూ యువకేంద్ర జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ అభినందించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబర్చాలని సూచించారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-ఆర్మూర్



పట్టణంలోని 6వ వార్డులోని మహిళా కేంద్రంలో జరగబోయే కంటి వెలుగు కార్యక్రమం కేంద్రాన్ని పరిశీలించినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ సోమవారం తెలిపారు. సౌకర్యాల ఏర్పాట్లకోసంవెళ్లి పరిశీలించామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినితపవన్, కౌన్సిలర్ పొద్దుటూరి మురళీధర్‌రెడ్డి, ఆరోగ్యశాఖ అధికారులు, ఆర్పీలు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- వ్యవసాయాధికారులు
- వరిపంటలు పరిశీలన

నవతెలంగాణ-ముప్కాల్/డిచ్‌పల్లి/ఆర్మూర్

మండలకేంద్రంతోపాటు నల్లూరు గ్రామంలో వరి పంటలను మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం వరి నాట్లు వేసే దశ నుంచి పిలకలు వేసే దశలో ఉన్నందున మొగి పురుగు నివారణకు నాట్లు వేసిన 15 నుండి 20 రోజుల లోపు కార్బోఫురాన్ 3జీ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలను 8 కిలోలు చొప్పున లేదా క్లోరిన్ట్రానిలిప్రోల్ 4 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. 30 రోజులు దాటిన పంటలో ఆకుముడత, మొగిపురుగు నివారణకు క్లోరోపైరిఫోస్ 2.5మి.లీ లీటర్ నీటికి లేదా కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ అనే మందుని 2గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలన్నారు. మొగి పురుగు లేదా ఆకు మడత లాంటి వరిని ఆశించే పురుగుల నివారించుకున్న తర్వాతనే యూరియా మోతాదు మేరకు మాత్రమే వాడాలన్నారు. లేకుంటే చీడ పీడల ఉధృతి అధికం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు లింగాపురం శ్రీనివాస్, విజయ్ రెడ్డి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:వరి పంటపై మొగి పురుగు నివారణ చర్యలు చేపట్టుకోవాలని డిచ్ పల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి జి.రాంబాబు సూచించారు. సోమవారం మండలంలోని ధర్మారం బి గ్రామమంలో వరి పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిలో కాండం తోలిచే పురుగు ఉధృతంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వివరించారు. వరిలో కాండం తొలిచే పురుగు/ మొగి పురుగు నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 4గ్రాములు గుళికలు 8 కిలోలు (లేదా) క్లోరాంట్రానిలిప్రోల్ 0.4గ్రాములు గుళికలు 4 కిలోల చొప్పున వేసుకోవాలని అన్నారు. వరిలో ఉల్లికోడు నివారణకు ఫిప్రోనీల్ గుళికలు లేదా ఫిప్రోనిల్ గుళికలు ఇసుకలో కలిపి వేసుకోవాలని తెలిపారు. 25 రోజులు పైబడిన పైరులో ఫిప్రోనీల్ లేదా కార్బోసల్ఫాన్ పిచికారి చేసుకోవాలని సూచించారు. రెల్లరాల్చు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ వాడాలని ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే క్లోరాంట్రానిలిప్రోల్ పిచికారి చేసుకోవాలని సూచించారు. కాండం తొలుచు, మొగిపురుగు నివారణకు కార్టర్ హైడ్రి క్లోరైడ్ 46 గుళికలు (లేదా) క్లోరాంట్రానిల్ గుళికలు వేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమలో గోపి, రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్ :వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ సంచాలకులు విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ తెలిపారు. మండలంలోని ఫతేపూర్ గ్రామంలో సోమవారం వరి పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారిలో మోగి పురుగును గమనించినట్లయితే నివారణకు ఎకరానికి కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు లేదా క్లోరంత్ర నిలిప్రోలు చల్లుకోవాలని, యూరియా మోతాదు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గడ్డం శ్రావణ్ రెడ్డి, ఏఈఓ నరేష్ ,రైతులు తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి: మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

దీర్ఘకాలిక రుణాలను వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-సిరికొండ



రైతులు కోపరేటివ్ బ్యాంకుల్లో తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు ఎల్టి లోన్స్ వెంటనే చెల్లించాలని, సొసైటీ లాభాలలో నిలవాలంటే రుణాలు సక్రమంగా చెల్లిస్తేనే లాభాల బాటలో పయనిస్తుందని స్థానిక సొసైటీ చైర్మన్ మైలారం గంగారెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలిక రుణాలపై అపరాధ రుసుం పూర్తిగా మాఫీ అయిందని, ఓవర్ డ్యూ ఉన్న రుణాలపై 30శాతం రాయితీ కల్పించారని తెలిపారు. క్రాప్ లోన్ రెన్యువల్ చేయించుకోని వారు తప్పక చేసుకోవాలని అన్నారు. ఇప్పటివరకు సొసైటీ పరిధిలో రెండు కోట్ల రూపాయల వరకు దీర్ఘకాలిక, ఓడి, క్రాఫ్ లోన్స్ ఉన్నాయని తెలిపారు. రుణాలను సక్రమంగా చెల్లిస్తేనే, మిగతా వారికి రుణాలు అందించే అవకాశం ఉంటుందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రుణాలను వెంటనే చెల్లించాలని ఆయన కోరారు.

తెలంగాణ మెడికల్ సేల్స్ రిప్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్





తెలంగాణ మెడికల్ సేల్స్ యఘానియన్-నిజామాబాద్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. వార్షిక జనరల్ బాడీ మీటింగ్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో అంతర్జాతీయ, దేశీయ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ విధానాలపై చర్చ నిర్వహించారు. కార్యదర్శి నివేదిక సమర్పించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి మురళి, సీఐటీయూ కార్యదర్శి నూర్జహాన్, సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి రమేష్ బాబు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకటేశ్వర స్వామి, ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్ రాజు, కోశాధికారిగా ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎమ్మే కరీముల్లా, అమరజీత్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా మహేష్ కులకర్ణి, పవన్ కుమార్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో వందమంది మెడికల్ రిప్రజెంటేటివ్‌లు పాల్గొన్నారు.

వంటమనిషికోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వంటమనిషి ఖాళీ ఉన్నట్టు పాఠశాల ప్రత్యేక అధికారి స్వప్న తెలిపారు. ఆసక్తి గలవారు ఒకటో తేదీలోగా సంబంధిత పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం నియమించుకోవడం జరుగుతుందని తెలిపారు.

ఉన్నత పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్లు అందజేసిన రిటైర్డ్ ఉద్యోగులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలకేంద్రానికి చెందిన రిటైర్డ్ డీపీవో సంజీవ్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పుష్పనాథ్ రెడ్డి సోమవారం ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫ్యాన్లను వితరణ అందజేశారు. రిటైర్డ్ డీపీవో సంజీవ్ ఐదు, పుష్పనాథ్ రెడ్డి రెండు ఫ్యాన్ల చొప్పున స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండోజి నరేందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపక బృందం వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంమోహన్ రావ్, భూపతి రావ్, రవి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావాణి పెండింగ్ ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- ప్రజావాణికి 90 ఫిర్యాదులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ ఉన్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 90 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జెడ్పి సీఈఓ గోవింద్, డీపీఓ జయసుధలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడంతో పాటు అర్జీదారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిపాజిట్ దక్కించుకుంటే రాజీనామాలు చేస్తాం

- ధర్పల్లి సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-ధర్పల్లి

బీజేపీ రూరల్ ఇంచార్జ్ కులాచారీ దినేష్ ఎమ్మెల్యేపై అవాకులు చవాకులు పేలారని, ఖబర్దార్ అని ధర్పల్లి సొసైటీ చైర్మన్ మల్లికార్జున్ మండిపడ్డారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..వండదిమడుగు, రావుట్ల, చీమన్‌పల్లి గ్రామాల్లో మాట్లాడినట్టు ఐదువేల మెజారిటీ వచ్చినట్లైతే సొసైటీ పాలక వర్గం మొత్తం రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని తెలిపారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను దేహి అని ప్రాధేయపడితే కనికరించి ఆదుకున్న వ్యక్తిపై ఇష్టం వచ్చినట్లు మరోసారి మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మరోమారు ఎమ్మెల్యేపై నిరాధారణమైన ఆరోపణలు చేస్తే సహించమని హెచ్చరించారు. సమావేశంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బూర్ల గున్నయ్య, డైరెక్టర్లు మాలావత్ బాలు నాయక్, సాలేహ బేగం, సభావాత్ శ్రీనివాస్ నాయక్, పోత రాజు, నర్సాగౌడ్ పాల్గొన్నారు.

వాలీబాల్ రాష్ట్ర జట్టుకు రోహిత్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండల కేంద్రానికి చెందిన వుట్నూరి రోహిత్ వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 20 నుండి 29 వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో నిర్వహించిన తెలంగాణ సీనియర్ జాతీయ వాలీబాల్ శిక్షణ శిబిరంలో పాల్గొన్నాడు. ఈ శిబిరంలో ఉత్తమ ప్రతిభ కనబరచడం ద్వారా వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఫిబ్రవరి 2 నుండి 9 వరకు అస్సాంలోని గౌహతిలో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రోహిత్ వాలీబాల్ రాష్ట్ర జట్టుకు ఎంపికవ్వడం పట్ల గ్రామస్తులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్ క్రీడాకారుడు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన రాకేష్ తెలంగాణ జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. ఫిబ్రవరి 3 నుండి 8 వరకు అస్సాం రాష్ట్రంలోని గౌహతి నగరంలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాకేష్‌ను తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ హనుమంత్ రెడ్డి, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్ , కోశాధికారి కాంతి గంగారెడ్డి, పీడీ పవన్, సర్పంచ్ చేతన విజయ రెడ్డి, ఎంపీటీసీ జయగిరిధర్ గౌడ్, ఉప సర్పంచ్ నాయకరాజు, ఎస్ఎంసి చైర్మన్ సత్యనారాయణ, వీడిసి సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్జీటీ భాషా పండితుల బదిలీలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలి

నవతెలంగాణ-ఆర్మూర్



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్జీజీ భాషాపండితులు

ఎస్జిటి భాషా పండితుల బదిలీలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని స్పౌజ్ ఫోరం సభ్యులు నందిపేట కేదారేశ్వర ఆశ్రమంలో ఎమ్మెల్సీ కవిత ను కలిశారు. 615 స్కూల్ అసిస్టెంట్స్ స్పౌజ్ బదిలీలు ప్రభుత్వం చేపట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి నుండి తమకు అండగా ఉండి ధైర్యం చెప్పి స్పౌజ్ సమస్యను పలుమార్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినందుకు కవితక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేవలం 30శాతం బదిలీలను చేశారని ఇంకా మిగిలిన ఎస్‌జిటి, భాషపండితులు, పీఈటీల స్పౌజ్ బదిలీల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత తొందరగా జరిపించాలని వేడుకున్నారు. ఇందులో మెజారిటీ మహిళ ఉపాధ్యాయినులే ఉన్నారనీ వారు తీవ్ర మానసిక ఆందోళనకు లోనవుతున్నారని పేర్కొన్నారు. ఎస్జీటీల విషయంలో పెద్ద మొత్తంలో ఖాళీలు ఉండడంతోపాటు ప్రస్తుతం జరగబోయే ప్రమోషన్‌లో కూడా ప్రతి జిల్లాకు 200-250 ఖాళీలు ఏర్పడనున్నాయి. కాబట్టి డైరెక్ట్ రిక్రూట్మెంట్ కు ఎలాంటి ఇబ్బంది ఉండదని, సాధ్యమంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని వేడుకున్నారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

పీఎంపీ డైరీ ఆవిష్కరణ



ఎమ్మెల్సీ కవితతో డైరీని ఆవిళష్కరిస్తున్న పీఎంపీలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నందిపేట్ మండలంలోని పలుగుట్ట లోని కేదారేశ్వర ఆశ్రమంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేతుల మీదుగా పీఎంపీ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఎంపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు పులగం మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాములు, నిజామాబాద్ పట్టణ అధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సాగర్, నరేష్, నరసయ్య, నందిపేట్, మండల కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్

- హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి దళితుడే ఉంటాడని ప్రకటించిన కేసీఆర్ మాట తప్పి మొట్టమొదట దళితులను మోసం చేసి దళిత ద్రోహిగా మారాడని హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు. పట్టణంలోని మామిడిపల్లి విజయలక్ష్మి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కుటుంబ పాలన కొనసాగుతుందని, కేసీఆర్ పాలనలో ఉద్యోగాలు రాక నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, టీఆర్ఎస్ పాలనలో తెలంగాణ వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని, రైతులు తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. 20 18 ఎన్నికలలో ఏకకాలంలో లక్ష రూపాయల లోపు పంట రుణాలను మాఫీ చస్తామని వాగ్దానం చేసి ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదని, చిన్న రాష్ట్రమైన తెలంగాణ రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే నాలుగో స్థానంలో ఉండటం దురదృష్టకరమని అన్నారు. హామీ మేరకు లక్ష రూపాయలలోపు పంట రుణాలను వడ్డీతో సహా వెంటనే మాఫీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎండేలా లక్ష్మీనారాయణ, ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా ,అల్జాపూర్ శ్రీనివాస్, పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి ,పల్లె గంగారెడ్డి, జెస్సు అనిల్,, పాలెపు రాజు, యోగిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

ఓడ్ కుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నవీపేట్

ఓడ్ కుల సంఘం క్యాలెండర్‌ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయులుగౌడ్ ఎల్బీ స్టేడియంలోని తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓడ్ కుల సంఘం సమాజంలో అత్యంత అణగారిన సంచార కులమని, అందుకే బీసీ -ఏ జాబితాలో చేర్చేందుకు తాను బీసీ కమిషన్ మెంబర్ గా కృషి చేశానని అన్నారు. భవిష్యత్తులో ఓడ్ కులస్తులకు అన్ని విధాలుగా తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు.

కేసీఆర్‌తోనే అనగారిన వర్గాల అభివృద్ధి

బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్

సీఎం కేసీఆర్ తోనే అణగారిన వర్గాల అభివృద్ధి సాధ్యమవుతుందని బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. సంచార ఓడుకుల సంఘం క్యాలెండర్ ను హైదరాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు ఉపేంద్రతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అణగారిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పవార్ కైలాష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాదవ్ శరత్, ఉపాధ్యక్షులు మహితే సంజీవ్, నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ రాజు, ఉపాధ్యక్షులు సుధాకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్

కీచక టీచర్‌ను అరెస్ట్ చేసి శిక్షించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కీచక టీచర్‌ను అరెస్ట్ చేసి చట్ట ప్రకారం శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. నిజామాబాద్ నగరంలో బర్కత్‌పుర అప్పర్ ప్రైమరీ హిందీ మీడియం స్కూల్లో ఐదో తరగతి అమ్మాయిని లైంగికంగా వేధించిన టీచర్ అరవింద్‌ను వెంటనే అరెస్ట్ చేసి చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఘటన వివరణలను స్కూల్‌కు వెళ్లి తెలుసుకున్నారు. టీచర్‌ను శిక్షించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనా కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మనోజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని పాలెం గ్రామానికి చెందిన రాజాగౌడ్ గల్ఫ్‌లో ప్రమాదానికి గురికావడంతో పదివేల రూపాయలను ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అందజేశారు. గల్ఫ్‌లో జరిగిన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. గల్ఫ్ వెళ్లిన రెండు రోజులకే ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో ఆరు నెలల పాటు గల్ఫ్‌లో చికిత్స చేయించుకొని ఇటీవల స్వదేశానికి తిరిగివచ్చారు. ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న సునీల్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.



3న పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ

- పాఠశాల అభివృద్ధి కమిటీ ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రంలోని పాఠశాల ఆవరణలో పాఠశాల అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. వచ్చేనెల 3న పాఠశాల ఆవరణలో విరాళాలతో నిర్మించే పాఠశాల భవన నిర్మాణాలకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించాలని పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్త గడ్డం రాజారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ చంద్రకళ బాలకృష్ణ, ఎంపీటీసీలు గడ్డం గంగారెడ్డి, తలారి మరియ సతీష్ , పాఠశాల ఎస్ ఎంసి చైర్మన్ గుడ్ల వేణు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ శ్రీనివాస్, రిటైర్డ్ డివిజనల్ ఇంజనీర్ రాజేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, ఎక్స్ సర్పంచ్ నర్సారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఉమామహేశ్వర్ రెడ్డి, జిపి పాలవర్గ సభ్యుడు చిట్ల శ్యాంసుందర్, వీడీసీ చైర్మెన్, సభ్యులు వైఎస్‌వైఏ యూత్ సభ్యులు, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుంది

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుంది అని రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. "లౌకికవాద పరిరక్షణ" అనే అంశం పై నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ... బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగానికి, దాని లక్ష్యాలకు ప్రమాదం ఏర్పడిందని, రాజ్యాంగాన్ని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, మైనారిటీలపై దాడి చేయటం, మెజారిటీలను రెచ్చగొట్టం రాజకీయంగా లబ్ధిపొంది అధికారాన్ని సుస్థిరం చేసుకోవటానికి ప్రయత్నిస్తోందని అన్నారు. సీఏఏ చట్టాలు తీసుకురావటం, 370 ఆర్టికల్ రద్దు చేయటం ద్వారా లౌకికవాదానికి ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, మహిళలపై దాడులు పెద్దఎత్తున జరుగుతున్నాయని, భారత రాజ్యాంగం లక్ష్యాలకు ఆశయాలకు స్ఫూర్తికి విఘాతం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. న్యాయవ్యవస్థను సైతం లొంగదీసుకునే ప్రయత్నాలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతోందనీ అన్నారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాం, జిల్లాసహాయ కార్యదర్శి కుశాల్, జిల్లా సమితి సభ్యులు దినేష్, సుభోద్, మధు, జిల్లా గర్ల్స్ కన్వీనర్ అంకిత, సభ్యులు నిత్య, అంజలి, మమతా, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

టేకు కలప పట్టివేత

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని తాటిపల్లి బీట్ పరిధిలో ఆదివారం రాత్రి అక్రమంగా 20 టేకు దుంగలను ట్రాక్టర్‌పై తీసుకెళ్తున్న వెంకటస్వామి వద్దనుండి అక్రమ టేకు కలప స్వాధీనం చేసుకొని పోలీసుల సహకారంతో సీజ్ చేసినట్లు అటవీ రేంజ్ అధికారి ఎన్.వి. నాయక్ సోమవారం తెలిపారు. టేకు దుంగల విలువ సుమారు 6599 రూపాయలుగా ఉంటుందని అన్నారు. ఎవరైనా అక్రమంగా టేకు కలప నరికినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తమకు అక్రమ కలపను నరుకుతున్న సమయంలో సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ గంగారాం ఫారెస్ట్ బీట్ అధికారి నవీన్, ఎస్సై నర్సింలు



ముత్యంపేటలో ఉచిత పశువైద్య శిబిరం

నవతెలంగాణ-దోమకొండ

మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని జడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఉచితంగా మందులను అందజేయనున్నట్టు తెలిపారు. కోరుట్ల కళాశాలకు చెందిన ట్రైనీ పశు వైద్యులు 20 మంది టీంతో పశు వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు వివరించారు. పశువులు ఆరోగ్యంగా ఉంటే పాల దిగుబడి ఎక్కువగా వస్తుందని అందువల్ల రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మూర్తి, విండో చైర్మన్ తిరుపతి గౌడ్, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, వంగ లలిత, రమణారెడ్డి, మండల పశు వైద్యాధికారి శివ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం మండలంలోని చింతలూరు గ్రామంలో జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ అధ్వర్యంలో యువకులకు ఏఎస్సై వెంకట్ అవగాహన కల్పించారు. చింతలూరు గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ సుకన్య ప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైమ్, గంజాయి, మత్తు పదార్థాలు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ గురించి వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ జీవన్ గ్రామ సర్పంచ్ సుకన్య ప్రసాద్ చింతలూరు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 33 గొర్లు మృత్యువాత



మృత్యువాతపడిన గొర్రెలు

నవతెలంగాణ-రామారెడ్డి

గొర్ల మందపై కుక్కలు దాడి చేసిన ఘటన మండలంలోని రెడ్డిపేటలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొల్లారం నడిపి మల్లయ్యకు చెందిన గొర్లమందపై కుక్కలు దాడి చేయగా, 33 గొర్రెలు మృతి చెందాయి. దీంతో దాదాపు రూ.మూడు లక్షలు నష్టం వాటిల్లింది. ఘటనా స్థలాన్ని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు ప్రభాకర్ రావు, కోలకాని ప్రసాద్, కుమ్మరి శంకర్, రామడుగు హనుమాన్లు తదితరులు పరిశీలించారు.

బోధన్ పట్టణ అభివృద్ధిని విస్మరించడం సరికాదు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణ అభివృద్ధికి పాటుపడవలసిన ప్రజాప్రతినిధులు పట్టణ అభివృద్ధిని విస్మరిస్తున్నారని.. అది సరికాదని బోధన్ పట్టణ ఎంఐఎం పార్టీ అధ్యక్షులు ముషీర్ బాబా అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఆయేషా గార్డెన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమీపంలోని బాన్సువాడ నియోజకవర్గం దినదిన అభివృద్ధి చెందుతుందని, అభివృద్ధి పనులు పుష్కలంగా జరుగుతున్నాయని, కానీ బోధన్‌లో అభివృద్ధి పనులు కానరావడం లేదని అన్నారు. ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుతో కొంతమంది ప్రజల మధ్య విభేదాలు సృష్టించి సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ మైనార్టీల సమస్యలను పరిష్కరించడం లేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ అధినేత నిర్ణయం మేరకు బోధన్‌లో అభ్యర్థి పోటీచేసే నిర్ణయం ఉంటుందని అన్నారు. సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హబీబ్ ఖాన్, కౌన్సిలర్ అఖిల్ ఫారుఖీ, వలీ ఉద్దీన్, నాయకులు రషీద్, అల్తాఫ్, నవీద్, ఆదిల్, అలీమ్, రజా తదితరులున్నారు.

నాలుగు నెలలు నిండిన దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాక్సిన్ తప్పక ఇవ్వాలి

- జుక్కల్ వెటర్నరీ డాక్టర్ పండరి నాథ్



పశువులకు టీకాలు

నవతెలంగాణ-జుక్కల్

నాలుగు నెలలు వయసు కలిగి ఉన్న ఆడ ఆవు, గేద దూడలకు బ్రుసులోసిస్ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలని జుక్కల్ వెటర్నరీ ఆసుపత్రి వైద్యుడు పండరినాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పాడిరైతుల ఇంటి వద్దకు వెళ్లి ఆడ దూడలకు బ్రుసులోసిస్ వ్యాక్సిన్‌ను స్థానిక సర్పంచ్ బొంపెలి రాములు చేతుల మీదుగా వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెటర్నరీ వైద్యుడు పండరి నాథ్ మాట్లాడుతూ.. నాలుగు నెలలు నిండి ఉన్న ఆడ దూడలకు మాత్రమే బ్రుసులోసిస్ వ్యాక్సిన్ ఇవ్వనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.రాములు, వెటర్నరీ వైద్యుడు పండరి నాథ్, బీఆర్ఎస్ నాయకుడు నీలుపటేల్, గోపాల మిత్రులు, పశుపోషకదారులు తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువల నిర్మాణం నాణ్యతగా చేపట్టాలి

- పీఆర్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-జుక్కల్

మురికి కాలువల నిర్మాణాలు నాణ్యతగా చేపట్టాలని జుక్కల్ పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హమ్మదాబాద్ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపడుతున్న మురికి కాలవల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ శ్రీనివాస్‌రెడ్డి గుత్తేదారునికి పలు సూచనలు చేశారు. మట్టిలేని ఇసుకతో పాటు సిమెంట్ నిబంధనల ప్రమాణాల ప్రకారం వేసి వాడాలని, నాలుగు కాలాల పాటు మురికి కాలవలు పటిష్టంగా ప్రజలకు ఉపయోగపడాలని ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. పీఆర్ ఏఈతో పాటు సర్పంచ్ లక్షెట్టి సాయిలు, గ్రామస్తులు రామన్న, తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-జుక్కల్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును జుక్కల్ ఎంపీపీ సుర్నార్ యశోదా లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన గంగవ్వ తుక్‌గొండకు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో ఉండగా మెరుగైన వైద్యం కొరకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. దీంతో రూ.13వేల చెక్కును ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బస్వాపూర్ సర్పంచ్ రవిపటేల్, బీఆర్ఎస్ నాయకుడు నీలుపటేల్, బస్వారాజ్ పటేల్, బస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్‌లో ఘనంగా బీరప్ప వేడుకలు

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో బీరప్ప పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా మహిళలు బోనాలను ఎత్తుకొని శోభాయాత్రగా భజాభజంత్రీలతో నిష్టగా పోతరాజుల విన్యాసలతో నిర్వహించారు. ఈ సందర్భంగా బీరప్ప ఉత్సవ విగ్రహనికి ప్రత్యేక పూజలు చేసి ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

పోసానిపేటలో పశువైద్య శిబిరం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేటలో జాతీయ సేవా పథకం కింద పశు వైద్య శిబిరాన్ని స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథరెడ్డి, సర్పంచ్ ఈరెడ్డి మహేందర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 107 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించినట్టు మండల పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కృష్ణ, లక్ష్మీ వైద్యులు రమేష్, అనిల్‌రెడ్డి, వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు పోరాడుదాం

- పలు గ్రామాల్లో అవగాహన

నవతెలంగాణ-విలేకరుల బృందం

బాల్యవివాహాల నిర్మూలనకు అందరం కలిసి కట్టుగా పోరాడుదామని పలువురు అన్నారు. జిల్లాలోని పలు గ్రామాలలో బాల్యవివాహాల నిర్మూలనపై సర్పంచుల అధ్యక్షతన అవగాహన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు.

జుక్కల్ : బస్వాపూర్ సర్పంచ్ రవిపటేల్ మాట్లాడుతూ.. బాల్యవివాహల వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. బాల్యవివాహాలు చట్టవిరుద్దమని, పద్దెనిమిది ఏండ్లు నిండిన తరువాత వివాహం చేయాలని, అప్పుడు మహిళలు సంపూర్ణంగా ఎదుగుదల కల్గి ఉంటారని పేర్కొన్నారు. చిన్న వయస్సులో వివాహలు చేస్తే ఆరోగ్య సమస్యలు వస్తాయని, ప్రమాదంతో పాటు ముప్పు వాటిల్లుతుందని అన్నారు. కార్యక్రమంలో జేపీఎస్ గంగాధర్, మాజీ సర్పంచ్ బస్వంత్, జీపీ పాలకవర్గ సభ్యులు గంగారాం, మల్లవ్వ శోభా, భాస్కర్, ఆశా నాగమణి, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మీ, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే నాగల్‌గావ్ జీపీలో సర్పంచ్ కపిల్ పటేల్, పడంపల్లి జీపీలో సర్పంచ్ గణేష్ పటేల్, ఖండేభల్లూర్ జీపీలో సర్పంచ్ మహనంద దేశాయి, సావర్‌గావ్‌లో సర్పంచ్ కిషన్ పవార్, లొంగన్‌లో సర్పంచ్ ఉషారాణి సదుపటేల్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. లొంగన్‌లో విండో చైర్మెన్ శివానంద్ పాల్గొన్నారు. అన్నీ గ్రామాల్లో జేపీఎస్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు..

భిక్కనూర్ : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని మండలంలోని బస్వాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరం వచ్చేవరకు వివాహాలు చేయవద్దని, బాల్యవివాహాలు జరిగితే అంగన్వాడీ టీచర్లు బాధ్యత వాయించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్ మంజుల మల్లారెడ్డి, ఉప సర్పంచ్ బిక్షపతి, ఎంపీటీసీ లీలావతి బాలా గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుర్రి గోపాల్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అమరావతి సిద్ధిరామిరెడ్డి, అంగన్వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



జుక్కల్ : ఖండేబల్లూర్‌లో అవగాహన



పిట్లం మండలంలో..

బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, గ్రామపంచాయతీ కార్యదర్శి సదాశివ్ సూచించారు. సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాల్య వివాహాల నివారణపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేవరకు వివాహం చేయకుండా అంగన్వాడీ టీచర్లు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సువర్ణ ప్రభాకర్, బండి చంద్రకళ రాములు, వార్డు సభ్యుడు రవి, అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ అన్నారు. మండల కేంద్ర గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ విజయ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన బాల్య వివాహాల అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎవరైనా బాల్యవివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే శిక్షార్హులవుతారని సూచించారు. చిన్నపిల్లలపై లైంగిక దాడులను ప్రోత్సహించిన వారు శిక్షార్హులు అవుతారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇబ్రహీం జునొది, సెక్రెటరీ యాదగిరి, అంగన్వాడీ టీచర్లు రాధా, బాలమణి, జయంతి, శోభారాణి, సుమలత, ప్రవీణ, విజయలక్ష్మి, ఆశలు సవిత, కుమారి, ఐకేపీ రిజ్వానా, లావణ్య, స్వప్న ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గాంధారి : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్ మాట్లాడుతూ.. చిన్న వయసులో అమ్మాయిలకు వివాహాలు చేయడం వల్ల వారి ఆరోగ్యంపై తీవ్ర భావం చూపుతుందని, అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని బాల్యవివాహాలను రూపుమాపల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌రెడ్డి రాజు, ఉప సర్పంచ్ కొమ్ముల రమేష్, కో ఆప్షన్ మెంబర్ ముస్తప్ప, పంచాయతీ కార్యదర్శి నాగరాజు వివిధ శాఖల అధికారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



గాంధారి : మాట్లాడుతున్న సర్పంచ్

బీజేపీ, కాంగ్రెస్ మాటలు నమ్మొద్దు

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వంగపల్లి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేతుల మీదుగా కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేందర్ తన స్వంత డబ్బులతో చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని ఈ మధ్య కాలంలో కాంగ్రెస్ బీజేపీ నాయకులు తిరుగుతూ అవి చేస్తాం ఇవి చేస్తాం అని పనికిమాలిన హామీలు ఇస్తున్నారని తెలిపారు. ఎల్లారెడ్డి ప్రజలు గమనిస్తున్నారని రాబోయే కాలంలో కాంగ్రెస్ బీజేపీ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రైతుల సంక్షేమం కోసం ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అని ఈ సందర్భంగా తెలియచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు 24 గంటల ఉచిత కరెంట్, రైతు బీమా, రైతుబంధు వంటి పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని తెలిపారు. అదేవిధంగా కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలు అమలు చేసి బడుగు బలహీన వర్గాలకు కేసీఆర్ ఎంతో సహాయం చేస్తున్నారని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ మాత్రం అదాని అంబానీలకు మాత్రమే రుణమాఫీ చేస్తున్నారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ప్రజలు రాబోయే కాలంలో ప్రతిపక్ష పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్ రాకుండా చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ ఉషగౌడ్, సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు, వెల్లుట్ల సొసైటీ చైర్మన్ పటేల్ సాయిలు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జలెందరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అధిములం సతీష్, చింతల శంకర్, కౌన్సిలర్‌లు, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు అధికారులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి : చెక్కులను, చీరలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

లింగంపేట్ : నాలుగు సంవత్సరాల అభివృద్ధిపై చర్చించడానికి లింగంపేట్ అంబేద్కర్ చౌరస్తాలో చర్చించడానికి సిద్ధంగా ఉన్నానని ఎల్లారెడ్డి శాసనసభ్యులు జాజాల సురేందర్ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. మండలంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో గల డీపీఎల్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కార్యక్రమంలో ఆయన ముఖ్య పాల్గొ న్నారు. అలాగే తన వంతు సహాయంగా పట్టు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ కాశి నారాయణ, వైస్ చైర్మన్ ఒంటరి సిద్దారెడ్డి, లింగంపేట్ జెడ్పీటీసీ సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, ఎంపీపీ గరీబున్నిసా నహీం, లింగంపేట్ సింగల్‌విండో చైర్మన్ దేవేంద రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షులు బండి రాజయ్య, ఎమ్మార్వో మారుతి, ఎంపీడీవో మల్లికా ర్జున్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్ర రాజేశ్వరరావు, సర్పంచులు అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పావలా వడ్డీ బకాయిలు చెల్లించాలి

- ఎంపీడీవో కార్యాలయం ముట్టడి

నవతెలంగాణ-భిక్కనూర్/రాజంపేట్

మహిళలకు వడ్డీ లేని రుణాలు.. అభయ హస్తం, శ్రీనిధి డబ్బుల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వేలాదిమంది మహిళలు ఎంపీడీవో కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. అంతకుముందు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించిన మహిళలు అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కేవలం మండలంలోని వడ్డీలేని రుణాలు 9 కోట్ల 26 లక్షల 16 వేల రూపాయలు మహిళలకు రావాల్సి ఉందని, మండలంలో 6800 మందికి అభయ హస్తం 8 సంవత్సరాలుగా అందజేయకుండా ప్రభుత్వం డ్వాక్రా మహిళలను మోసం చేస్తుందని ఆరోపించారు. డ్వాక్రా మహిళలకు రావలసిన డబ్బులను వెంటనే విడుదల చేయకుంటే ప్రజాప్రతినిధులను మహిళలు గ్రామాల్లో తిరగనీయ్యరని హెచ్చరించారు. ఫిబ్రవరి 10వ తేదీ లోపు డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో మండలాధ్యక్షుడు రెడ్డిగారి రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగి రిగౌడ్, రవీందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బసవరెడ్డి, చిన్నోళ్ల శంకర్, పైడి రాజశేఖర్ రెడ్డి, కుమారస్వామి, ఏక్‌నాథ్, గరిగంటి నర్సింలు, మండ లంలోని అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, అన్ని మోర్చాల అధ్యక్షులు కార్యదర్శులు, వేల సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



భిక్కనూర్ : వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

రాజంపేట్ : డ్వాక్రా సంఘాలకు సంబంధించి పావలా వడ్డీ బకాయిలను, డ్వాక్రా సంఘాలను సంబంధించి వడ్డీ లేని రుణాలు, స్త్రీనిధి రుణాల వడ్డీ బకాయిలు, అభయ హస్తం డబ్బులు వెంటనే విడుదల చేయాలని రాజంపేట మండల కేంద్రంలో మహిళలు పెద్దమ్మ గుడి నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ఎంపీడీవో కార్యాలయం వరకు చేరుకొని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దేవిరెడ్డి గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పిట్ల శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు బక్కి సంధ్య, బీజేవైఎం అధ్యక్షులు సంపత్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు పందుల స్వామి, వివిధ గ్రామాల అధ్యక్షులు గుర్రాల రాము, సాయిరెడ్డి, రమేష్, దుర్గాప్రసాద్, శ్రీకాంత్, సంతోష్ వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తులతో అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-పిట్లం

సైబర్ నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ లింబాద్రి అన్నారు. సోమవారం మండలంలోని రాంపూర్ గ్రామంలో సైబర్ క్రైమ్ ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాటరీ టికెట్, లోన్ మంజూరి అయిందని వాటి ఖర్చులకు గాను జీఎస్టీ చెల్లించాలని డబ్బులు కట్టించుకోవడం, బ్యాంకు బ్యాలెన్స్ ఖాళీ చేయడం వంటి సైబర్ నేరస్తుల మోసపూరిత మాటలను నమ్మి మోస పోవద్దని సూచించారు. రోడ్డుపై ప్రయాణించినప్పుడు డ్రైవింగ్ లైసెన్స్, వాహనం ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించి ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానం చేరుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్, కానిస్టేబుల్ ఓంకార్, కాషాగౌడ్, ఏఆర్



ఆర్పీసీ మోయిన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మురికి కాలువ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్




నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారంతో 5లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ డ్రయినేజీ పనులను సర్పంచ్ బొల్లు లావణ్య, ఎంపీపీ గరీభున్నిసా బేగం సోమవారం ప్రారంభించారు. లంబాడి చందర్ ఇంటి నుంచి కురుమ సాయవ్వ ఇంటి వరకు 3వ వార్డులో చాలా కాలంగా డ్రయినేజీ లేకపోడంతో కాలనీవాసులు ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన సానుకూలంగా స్పందించి డ్రయినేజీ పనులకు నిధులను కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కౌడ రవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేష్, మండల యూత్ లీడర్ నరేష్, సింగిల్ విండో చైర్మన్ దేవిందర్ రెడ్డి, వైఎస్ చైర్మన్ మాకం రాములు, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు సాయిరాం, వార్డు మెంబర్లు ప్రసాద్, రమేష్, లక్ష్మీ నారాయణ, బీఆర్ఎస్ నాయకులు నాయిమ్, నరహరి, జొన్నల రాజు, కాముని శ్రీనివాస్, రమేష్, సాయిలు, నాగయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

మన ఊరు మన బడి పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

నవతెలంగాణ-వర్ని



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

చందూర్ మండల కేంద్రంలోని మన ఊరు – మనబడి కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేయబడిన ప్రభుత్వ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రా సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జెడ్పీహెచ్ఎస్, ప్రైమరీ స్కూల్ పనులను వేగవంతం చేయాలని, విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాలు వసతులు కల్పించాలని ఆమె అధికారులకు సూచించారు. సర్పంచ్ సాయరెడ్డి ఈ సందర్భంగా కలెక్టర్‌ను చందూర్ పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్చాలని కోరగా అందుకు ఆమె ప్రయత్నాలు చేస్తానని హామీ ఇచ్చారు. చందూర్ గ్రామంలోని అవెన్యూ ప్లాంటేషన్, హరితహారం, నర్సరీ పనుల విషయంపై ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంఈవో శాంతకుమారి, ఎంపీడీవో నీలావతి, ఎంపీఓ తారాచంద్, పాఠశాల చైర్మన్ గంగాధర్, పంచాయతీ సెక్రెటరీ సాయిలు తదితరులున్నారు.

మహాత్మాగాంధీ వర్ధంతి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం ఆయన విగ్రహానికి డీసీసీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి భీమ్‌రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, మాజీ జిల్లా సెక్రెటరీ చేపూరి రాజు, పార్టీ సీనియర్ నాయకులు మద్ది సూర్యకాంత్‌రెడ్డి, జిల్లాల రాజు, ఏనుగు మురళి, వడ్డే శశి, శ్రీకాంత్ రెడ్డి, ఈరేఖర్ ఓం, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మన ఊరు మన బడి పథకంలో భాగంగా ప్రాథమిక పాఠశాల అన్నాసాగర్ నందు సోమవారం 28లక్షల అంచనా వ్యయంతో రెండు తరగతి గదుల నిర్మాణం కొరకు సర్పంచ్ పెరుగు నాగరాజు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉమాదేవి గురుప్రతాప్, ఏఈ కృష్ణ, ఉప సర్పంచి సుజాత రాజు, రెండు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శిరీష్, జోసఫ్ రత్న కాంత్, పాఠశాల చైర్మన్ శ్వేత, వార్డు సభ్యులు ఇతర గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మహారాణా ప్రతాప్ కబడ్డీ జట్టుకు ప్రశంస

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఈ నెల 10,11,12న కేసీఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంట్ స్థాయి కబడ్డీ పోటీలో మహారాణ ప్రతాప్ కబడ్డీ జట్టు మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మహారాణ ప్రతాప్ కబడ్డీ టీం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, మహారాణ ప్రతాప్ కబడ్డీ క్లబ్ గౌరవాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ సభ్యులు అయినందున మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి, మంచి పేరు తేవాలని తెలిపారు. క్రీడాకారులను ప్రత్యేకంగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ గజన్‌లాల్, జిల్లా కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్ పాల్గొన్నారు.

అసద్ బాబానగర్‌లో ఒకరి హత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని అసద్‌బాబా నగర్‌లో ఆదివారం రాత్రి ఒకరు హత్యకు గురయ్యారు. అసద్ బాబా నగర్‌లోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న అహ్మద్ ఖాన్ (52)ని అదే అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న భాష కత్తితో పొడవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. అపార్ట్‌మెంట్ డ్రైనేజీ సిస్టం పాడవడంతో దాన్ని అహ్మద్ ఖాన్, మునీర్ రిపేర్ చేస్తుండగా పాషాతో గొడవపడ్డాడు. ఆ సమయంలో అహ్మద్ ఖాన్ పాషాను కొట్టాడు. దాంతో ఆగ్రహంతో ఉన్న పాషా స్థానికంగా ఉండే తన స్నేహితుడు అక్తర్‌ను రప్పించాడు. తన ఇంటిలో నుంచి కత్తిని తీసుకొచ్చి అహ్మద్ ఖాన్ గుండెలో కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమైన అక్కడే కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తరలించగా మరణించాడు. బద్రి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

లౌకిక సంస్కృతిని పరిరక్షించుకుందాం

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ సిటీ : లౌకిక సంస్కృతిని పరిరక్షించుకుందాం అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ రాజరిక వ్యవస్థలో భారతదేశం 550 సంస్థానాలుగా ఉండేదని, ఈ దేశంలో విభిన్న మతాలు, జాతులు, కులాలు కలిసి ఉండేవారని, అందువల్లే భారతదేశం లౌకిక వ్యవస్థగా ఏర్పడిందని తెలిపారు. ఈ లౌకిక వ్యవస్థ పరిరక్షణ కోసం అందరు కృషి చేయాల్సిన అవసరం ఉందని అనానరు. మతసామరస్యం-లౌకికవాదం కోసం మొట్టమొదట ప్రాణాలర్పించిన అహింసామూర్తి మహాత్మా గాంధీ అని అన్నారు. మహాత్ముడు కన్న కలలు నెరవేర్చడం కోసం పాలకులు కృషి చేయాలని అన్నారు. విదేశాల పర్యటనలలో భారత ప్రధాని నరేంద్ర



నిజామాబాద్‌సిటీ : గాంధీ చిత్రపటానికి నివాళి

మోడీ గాంధీజీ జపం చేస్తారని, మహాత్మ గాంధీజీని చంపిన గాడ్సేకు ఎందుకు గుడి కట్టిస్తున్నారని ఈ సందర్భంగా ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, పి.ముత్యాలు, హనుమాన్లు, రఘురాం, అంజలి, సుబోధ్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని అడుగు జాడల్లో నడవాలి..

కమ్మర్‌పల్లి: ప్రతి మనిషి జాతిపిత మహత్మ గాంధీ అడు గు జాడల్లో నడవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి అన్నారు. సోమవారం మండల కేంద్ర శివారులోని గాంధీనగర్‌లో మహత్మ గాంధీ 75వ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన చూపిన శాంతి సందేశం ప్రతి ఒక్కరికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చి మల్లయ్య, నిమ్మ రాజేంద్ర ప్రసాద్, సల్లూరి గణేష్ గౌడ్, వేములవాడ జగదీష్, పూట్నూరి ప్రదీప్, పూజరి శేఖర్, రాములు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి :మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో జాతిపిత గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆవరణలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి గ్రామపంచాయతీ పాలకవర్గం ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లతా దేవరాజ్, ఉప సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

సిరికొండ:స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని, సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పాఠశాలలో భారత స్వాతంత్ర సమరయోధుడు, జాతిపిత, అహింసవాది మహాత్మా గాంధీ 75 వ వర్ధంతి, స్వాతంత్ర సమరంలో అసువులు బాసిన యోధుల స్మారక అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హసకొత్తూరులో నివాస గృహం దగ్ధం

- ప్రమాదంలో కాలిపోయిన రూ.2.50లక్షల నగదు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని హసకొత్తూరులో సోమవారం ఇంట్లోని విద్యుత్ తీగలతో షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో నివాసగృహం దగ్ధమైంది. గ్రామానికి చెందిన పెద్ది నారాయణకు సంబంధించిన పెంకుటిల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమవడంతో పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. సుమారు రూ. మూడు లక్షల 79వేల వరకు నష్టం జరి గింది. ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, నిత్యావసర సరుకులు, బట్టలతోపాటు కుటుంబ సభ్యులు పది సంవత్సరాల కష్టపడి సంపా దించుకొని సందూకులో దాచుకున్న సుమారు రూ. రెండు లక్షల 50 వేల వరకు నగదు కాలిపోయింది. గ్రామస్తులు అగ్ని ప్రమాదం జరిగిన విష యాన్ని తహసిల్దార్ కార్యాలయంకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఇంట్లోనే విద్యుత్ తీగలతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్నిప్రమాదం సంభవించినట్లు గుర్తించారు. పంచనామా నిర్వహించి నష్టం వివరాలను సేకరించారు. బాధిత కుటుంబ సభ్యులను సర్పంచ్ ఏను గు పద్మ రాజేశ్వర్ పరామర్శించారు. రిజన నిరుపేద కుటుంబమైనందున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

సీపీఐ(ఎంఎల్) నాయకుడు సారా సురేష్‌ను పరామర్శించిన మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఇటీవల అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నిజామాబాద్ జిల్లా నాయకులు సారా సురేష్‌ను సోమవారం రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహనిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్సపై డాక్టర్లను ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డాక్టర్ కార్తీక్, డ్యూటీ డాక్టర్లకు సూచించారు. సురేష్‌కు మంత్రి మనోధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సహాయ కార్యదర్శి దేవారామ్, నిమ్స్ సూపరింటెండెంట్ సత్యనారాయణ, రమేష్ తదితరులు ఉన్నారు.

వర్నిలో సామాజిక తనిఖీలు

నవతెలంగాణ-వర్ని

వర్ని మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి హామీలో భాగంగా కొనసాగిన పనుల వివరాలను డీఆర్‌డీఓ చందర్‌నాయక్ ఆధ్వర్యంలో సోమవారం సామాజిక తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా పనుల గుర్తింపు, ఖర్చులు, కూలీలకు చెల్లించిన బిల్లులు, మిగిలిన ఉన్న పనుల వివరాలను తనిఖీ చేశారు. లోపాలు ఉన్నవారికి వద్ద నుంచి రికవరీ చేసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఎంపీడీవో బసిరుద్దీన్, శ్రీనివాసరావు, ఎంపీవో చందర్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్సీకి ఘన స్వాగతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి జాతీయ రహదారి-44 టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, అర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని సోమవారం బీఆర్ఎస్ ఇందల్ వాయి మండల అధ్యక్షులు చిలివెరి దాసు, గన్నరం మాజీ సర్పంచ్ చిలివెరి లావణ్య దాస్ ల అధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో సినియర్ నాయకులు పాశం కుమార్, జాగృతి మండల అధ్యక్షులు బొడ్డు గంగాధర్, సొసైటి డైరెక్టర్ కుంట రాంరెడ్డి, కుమార్, దొండడి గణేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు బిచ్కుందలో ఇసుక వేలం పాట

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండలంలోని మంజీర పరివాహక ప్రాంతం నుంచి రాత్రి సమయాల్లో అనుమతులు లేకుండా అక్రమ ఇసుకను తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. బిచ్కుంద తహసీల్దార్ ఆదేశాల మేరకు బొలెరో వాహనాల్లోని ఇసుకను పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలంపాట నిర్వహిస్తున్నట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు డిపాజిట్ సొమ్ము చెల్లించి ఇసుక వేలం పాటలో పాల్గొనవచ్చని నియమ నిబంధనలకు లోబడి వేలంపాట నిర్వహించనున్నట్టు వివరించారు.

ఎమ్మెల్యే షకీల్‌పై ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలోనే కాకుండా బోధన్ పట్టణ అభివృద్ధికి బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని, కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అన్ని వార్డులలో అభివృద్ధి పనులు చేపట్టారని, అయినా కొంతమంది కావాలనే ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఇది సమంజసం కాదని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా ఉన్న వార్డులలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఇప్పటికే కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమం కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యే షకీల్ అమీర్‌కు బోధన్ ప్రజల అండదండలు సంపూర్ణంగా ఉంటాయని ఆయన అన్నారు. అంతేకానీ ఆయనపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం లాంటివి మానుకోవాలని సూచించారు. సమావేశంలో నాయకులు పట్టణ రైతు విభాగం అధ్యక్షులు నక్కలింగారెడ్డి, మారుతి మందిర్ చైర్మన్ గుమ్మల అశోక్‌రెడ్డి, మైనార్టీ నేతలు ఉన్నారు.

చలో హైదరాబాద్ తరలిన కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్‌కు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని, కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో చలో ఎస్‌పీడీ (స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్) కార్యాలయం ముట్టడికి జిల్లా నుండి కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ... జీవో నెం.60 వీరికి అమలు కావడం లేదని అన్నారు. ఖాళీలు భర్తీ చేయడం లేదని, కేజీబీవీలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ ఇవ్వడం లేదని అన్నారు. కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. పదవీ విరమణ చేసిన వారికి గ్రాట్యుటీ చెల్లించాలని, చనిపోయిన వారి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఆ తర్వాత అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు హేమలత, సుమలత, శోభ, విక్టోరియా విజయమ్మ, శారద, జమున, సీతామహాలక్ష్మి జ్యోతి, పద్మ, సంగీత, విజయ తదితరులున్నారు.

ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌కు సన్మానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

బీజేపీ నిజామాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం ఆర్మూర్ లోని మామిడి పల్లి విజయలక్ష్మి గార్డెన్‌లో నిర్వహించగాముఖ్య అతిథిగా హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వచ్చారు. ఈసందర్భంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కులచారి దినేష్ కుమార్ అధ్వర్యంలో పలు మండలాలకు చెందిన బీజేపీ నాయకులు ఇందల్ వాయి మండలంలోని గన్నరం గ్రామ సమీపంలోని పెద్దమ్మ ఆలయం వద్దకు చేరుకుని పూల బొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఇంచార్జీ దన్ పాల్ సూర్యనారాయణ గూప్త, డిచ్‌పల్లి ఎంపిపి గద్దె భూమన్న, గన్నరం సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు కెపి రెడ్డి యాదవ్, మేండే అశోక్, సఖి లక్ష్మీనారాయణ ఉంగరాల శ్రీనివాస్ సంఖ్య శ్రీనివాస్ ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్మూర్ వరకు కారు బైక్ ర్యాలీ నిర్వహించారు.

విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

- లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తాం
- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-ఆర్మూర్

ఈసారి బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తాంఅని పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు ఎం.నరేంధర్ అన్నారు. ప్రజాపంథా కుమార్ నారాయణ భవన్ లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యం. నరేందర్, ఏరియా అధ్యక్షుడు ఎల్.అనిల్ మాట్లాడుతూ... కొఠారి కమిషన్ చెప్పిన విధంగా విద్యారంగం అభివృద్ధి చెందాలంటే 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుండి కేటాయించాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ గారు ప్రకటన చేసిన విధంగా అమలు చేయాలని కోరారు. సంక్షేమ హాస్టళ్లకు సమస్యలను పరిష్కరించాలని, కళాశాల హాస్టల్‌కు నూతన భవనాలను ఏర్పాటు చేయాలని, మెస్‌చార్జీలను పెంచాలని సంక్షేమ హాస్టల్ విద్యార్థులను కాస్మొటిక్ చార్జీలను ఇవ్వాలని అన్నారు. బాలికల హాస్టల్‌లో ఏఎన్ఎంను నియమించాలని, జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను పరిష్కారం చెయ్యాలని కోరారు. లేదంటే అసెంబ్లీ సమావేశాలను మొట్టడిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏరియా ప్రధాన కార్యదర్శి డి నిఖిల్, నాయకులు అనిల్ సాహెబ్ రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3వేల వేతనం జీఓ అమలు చేయాలి

నవతెలంగాణ-బోధన్

మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం రూ.3000ల వేతనం అందిస్తామని ప్రకటించిన జీఓను తక్షణమే అమలు చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు బోధన్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రవర్తి మాట్లాడుతూ.. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు 3000ల వేతన జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి సంవత్సరం అయినా అమలు చేయడం లేదన్నారు. జీవో జారీకోసం మధ్యాహ్న భోజన కార్మికులు ఆశతో ఎదురుచూస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్‌కు ఇచ్చిన మాట గుర్తుందో లేదోనని ఎద్దేవా చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యను పరిష్కరించని యెడల మార్చి నుంచి నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. కోడిగుడ్డు ధర మార్కెట్‌లో విపరీతంగా పెరిగినా.. ప్రభుత్వం దానికి తగిన ధర కల్పించడం లేదన్నారు. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారికి ప్రొసిడింగ్ ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో మండల బాధ్యురాలు ఉమా, రెడ్డి శ్యామ్ రావు, గౌస్, నాగరాజు, ఈశ్వరీ పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

లయన్స్ క్లబ్ సేవలకు అవార్డులు

నవతెలంగాణ-బోధన్


సాధించిన అవార్డులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా బోధన్ పట్టణంలోని రవి గార్డెన్‌లో రీజినల్ చైర్మన్ ఆదినారాయణ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ బోధన్ 26 అవార్డులను పొందడం అందరికీ గర్వకారణమని లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అధ్యక్షులు కొడాలి కిషోర్ ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం లయన్స్ కంటి హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన అవార్డులను ప్రదర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన లయన్స్ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతూ ఎన్నో అవార్డులు పొందడం జరిగిందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి మరిన్ని అవార్డులు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. రీజియన్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఘట్టమనేని బాబురావు, వీడీజీ-1 లక్ష్మీ బసవేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రెసిడెంట్ ప్రతాప్ గుప్తా, కార్యదర్శి నాగేశ్వరరావు, ట్రెజరర్ సురేందర్ చౌదరి వారు కార్యక్రమాలను దిగ్విజయం చేస్తున్నారని అన్నారు. అవార్డుల సాధనలో లయన్స్ క్లబ్ ముఖ్యులు బసవేశ్వర రావు, లక్ష్మీల కృషి ఎంతో ఉందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సేవలను గుర్తించి అవార్డులను అందించిన రీజియన్ చైర్మన్-10 ఆదినారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రెడ్‌క్రాస్ రీజియన్ చైర్మన్ ఉన్న బసవేశ్వరరావు గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రతిష్టాత్మక సేవ అవార్డు పొందడం తామరందరికీ గర్వకారణమని అన్నారు. సమావేశంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు బసవేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రతాప్ గుప్తా పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి చాటడం అభినందనీయం

- కరాటే విద్యార్థులకు కలెక్టర్ ప్రశంస



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

క్రీడా స్ఫూర్తి చాటడం అభినందనీయమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులను కలెక్టర్ ప్రశంసించారు. అనంతరం కరాటే శిక్షకుడు లోహిదాస్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నుంచి 12 మంది విద్యార్థులు హన్మకొండ జిల్లాలో నిర్వహించిన జిల్లాస్థాయి కరాటే టోర్నమెంట్‌లో ప్రతిభ చాటారని తెలిపారు. కుమిటి విభాగంలో పద్వీరాజ్, సాయి చరణ్, శ్రీహరి మొదటి (గోల్డ్ మెడల్), విశ్వతేజ (సిల్వర్ మెడల్), ధీరజ్ (సిల్వర్ మెడల్), ఆశిష్ (బ్రౌంజ్ బెల్ట్), కటా విభాగంలో ఇంగు సుశ్రిత్ (సిల్వర్ మెడల్), విశాల్ (సిల్వర్ మెడల్), వెన్నెల (సిల్వర్ మెడల్), ప్రవీణ్ (బ్రౌంజ్ బెల్ట్), చైతన్య (బ్రౌంజ్ బెల్ట్), పార్వతి (బ్రౌంజ్ బెల్ట్) సాధించినట్టు తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, పిల్లలందరిలో దాగున్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యం వైపు పయనించాలని అన్నారు.

రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్రంలో ఫిబ్రవరి 3న శీతాకాల బడ్జెట్లో 30శాతం నిధులు విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్‌తో పీడీఎస్‌యూ నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఎన్‌ఆర్ భవన్, కోటగల్లిలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. అశూర్, డి.నవీన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మేడిపండువలే తయారైందని, స్కూల్ స్థాయి నుండి యూనివర్సిటీ స్థాయి వరకు మౌలిక సదుపాయాలు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని అన్నారు. స్కూల్లు, కాలేజీలు, గురుకులాల్లో బాసర ట్రిపుల్ ఐటీలో చదివే విద్యార్థులకు విషపూరితమైన భోజనం అందించడం ద్వారా విద్యార్థులు తీవ్ర అస్వస్థకి గురవుతున్నారని అన్నారు. కాలేజీ స్థాయిలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతి గృహాలు, సౌకర్యాలు లేకపోవడం ప్రభుత్వ మొద్దు నిద్రకు నిదర్శనమని అన్నారు. నూతన భవనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ కాస్మొటిక్ చార్జీలు పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని, చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నగర ఉపాధ్యక్షులు మహిపాల్, నాయకులు రాజేష్, సలీం, పవన్ పాల్గొన్నారు.

బంగారు పతకం సాధించిన భీమ్‌గల్ విద్యార్థి

నవతెలంగాణ-భీమ్‌గల్



ఆసియా మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో భీమ్‌గల్ విద్యార్థి బంగారు పతకం సాధించాడు. హైదరాబాద్ యూసుఫ్ గూడలోని కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆసియా మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. కరాటే విభాగంలో నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండల కేంద్రంలోని విశ్వభారతి విద్యాలయం పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న మహంత్ రాజ్ బంగారు పతకం సాధించాడు. కార్యక్రమంలో శ్రీధర్, అమర్ సింగ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో సోమవారం అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకొని ఎస్ఐ రాజశేఖర్ నివాళులు అర్పించారు. తన సిబ్బందితో కలిసి కమ్మర్ పల్లి పోలీస్ స్టేషన్ లో రెండు నిమిషాలు మౌనం పాటించి అమరవీరులకు నివాళులు అర్పించారు. సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.


నివాళులర్పిస్తున్న పోలీసులు

CHANGE OF NAME

I, **Shaik Wajid S/O Shaik Pasha** R/O 9-20-131, Rehmatpura, Malapally, Nizamabad-503001, T.S. Changed My Name As **Mohammad Tajammul Hussain S/O Mohammad Muzammil Hussain.**

SAWAN SABOO - 9440560256

PUBLIC NOTICE

This is to inform the general public and all financial institutions that one Sri Jaidi NaveenReddy S/o Jaidi Ganga Reddy, aged about (28) years, Occ: Agriculture, R/o H. No: 7-69, Mothe Village of Velpur Mandal, District Nizamabad, that the below mentioned schedule property is owned by the above person, who actually purchased the Schedule Property with boundaries, from his Vendor Smt. Jaidi Gangu W/o Jaidi Ganga Reddy. And the same property she is now offering towards security for availing Housing Loan by creating Mortgage over the same infavour of my client company **TATA** Capital Housing Finance Limited, Nizamabad Branch.

Schedule of Property with its "Registered Sale Deed Doc. No. 591/2022, Dated: 28-01-2022" pertaining to the "The Open Place of (Collapsed House) bearing G.P. No. 7-70, 7-71, admeasuring total site area: 1756.69 Sq. feet or (195.18)Sq. Yards of (163.26) Sq. Meters, Property Situated at MOTHE VILLAGE OF VELPUR MANDAL, District Nizamabad, Grampanchayath: Mothe, Mandal Parishad: Velpur, Zilla Parishad: Nizamabad, Registration Sub-District Bheemgal and Registration District Nizamabad".

As Bound By:
NORTH : Road.
SOUTH : House of P. Rajeshwar.
EAST : House of Jaidi Gangu
WEST : Road.

Hence the General Public and financial institutions are hereby informed that, whoever, having any claim, right or any sort of right over the said property and the said documents, the same may be informed to the undersigned within (07) days from the date of publication of this notice.

Date: 29-01-2023.
Nizamabad.

R. Sri Rama Goud,
Advocate,
3-3-198, Maisamma Street,
Kotagalli, Nizamabad.
Cell No. 9440415406.

PUBLIC NOTICE

This is to inform the general public and all financial institutions that one Smt. Marri Laxmi W/o Marri Raju, aged about (34) years, Occ: Hose Wife, R/o H. No. 1-18-51, I.B Colony, ARMOOR Proper and Mandal, District Nizamabad, that the below mentioned schedule property is owned by the above person, who actually purchased the Schedule Property with boundaries, from her Vendor Sri Marri Raju S/o Marri Komaraiah. And the same property she is now offering towards security for availing Housing Loan by creating Mortgage over the same infavour of my client company **TATA** Capital Housing Finance Limited, Nizamabad Branch.

Schedule of Property with its "Registered Sale Deed Doc. No. 6408/2022, Dated: 12-10-2022" pertaining to the "Existing Ground Floor RCC Roofed Residential Building bearing Municipal H. No: 1-18-50/2/1, admeasuring total site area: 121.00 Sq. yards or 101.17 Sq. Meters, and Ground Floor RCC Roof: 765.44 Sq. feet, Situated at ARMOOR proper and Mandal, Municipality: Armoor, Mandal Parishad: Armoor, District and Zilla Parishad Nizamabad, Registration District Nizamabad and Registration Sub-District ARMOOR".

As Bound By:
NORTH : Open Plot of Kishan.
SOUTH : House of Vadla Srinivas.
EAST : Road.
WEST : Open Plot of Vijay.

Hence the General Public and financial institutions are hereby informed that, whoever, having any claim, right or any sort of right over the said property and the said documents, the same may be informed to the undersigned within (07) days from the date of publication of this notice.

Date: 30-01-2023.
Nizamabad.

R. Sri Rama Goud,
Advocate,
3-3-198, Maisamma Street,
Kotagalli, Nizamabad.
Cell No. 9440415406.

PUBLIC NOTICE

This is to inform the general public and all financial institutions that one Smt. Mudedla Sravanthi W/o Suman, aged about (34) years, Occ: Agriculture, R/o H. No: 1-1/1/A, BEJJORA Village of Bheemgal Mandal, District Nizamabad, that the below mentioned schedule property is owned by the above person, who got the Schedule Property with boundaries, from her Donor Sri Mudedla Suman S/o Late Limbaiah. And the same property she is now offering towards security for availing Housing Loan by creating Mortgage over the same infavour of my client company **TATA** Capital Housing Finance Limited, Nizamabad Branch.

Schedule of Property with its "Registered Gift (Settlement) Deed Doc. No. 5400/2022, Dated: 21-12-2022" pertaining to the "The RCC Roofed House bearing G.P. No. 1-1/1/A, admeasuring total site area= (2086.2) Sq. feet or (231.8) Sq. yards or (193.81) Sq. Meters, and RCC Roof Ground Floor Built up area= 1166.62 Sq. feet, Property Situated at Bejjora Village of Mandal Bheemgal, District Nizamabad, Grampanchayath Bejjora, Mandal Parishad: Bheemgal, Zilla Parishad: Nizamabad, Registration Sub-District Bheemgal and Registration District Nizamabad".

As Bound By:
NORTH : 12'-0" Road.
SOUTH : Plot of Kande Swamy.
EAST : Bejjora to Bheemgal Main Road.
WEST : Open Place of Donor and Mudedla Narsaiah.

Hence the General Public and financial institutions are hereby informed that, whoever, having any claim, right or any sort of right over the said property and the said documents, the same may be informed to the undersigned within (07) days from the date of publication of this notice.

Date: 30-01-2023.
Nizamabad.

R. Sri Rama Goud,
Advocate,
3-3-198, Maisamma Street,
Kotagalli, Nizamabad.
Cell No. 9440415406.